రాజ్యాంగంపై బిజెపి బుల్డోజర్

- దళితులు, గిరిజనుల హక్కులు కాలరాస్తోంది
- రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ స్వీకరించలేదు
- సంపదను అదానీ, అంబానీలకు కేంద్రం దోచిపెడుతోంది
- కార్మికుల హక్కుల కోసం సంఘటితంగా పోరాడుదాం
- రాజ్యసభ మాజీ సభ్యులు బృందాకరత్
- ఆదిలాబాద్‌లో సిఐటియు కార్యాలయం ప్రారంభం

బహిరంగ సభకు వచ్చిన ప్రజానీకం ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న బృందాకరత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"భారత రాజ్యాంగంపై బిజెపి ప్రభుత్వం బుల్డోజర్ ప్రయోగిస్తోంది.. రాజ్యాంగానికి పలుమార్లు సవరణలు చేస్తూ దళితులు, గిరిజనుల హక్కులను కాలరాస్తోంది. ఇది బిజెపి ప్రభుత్వం కాదు.. ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం.. 1950 నుంచి ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని ఎప్పుడూ స్వీకరించలేదు.. దేశంలో మనుస్మృతి అమలు చేయాలని కోరుకుంటోంది.. బిజెపి ప్రభుత్వం రెండు తుపాకీ గొట్టాలతో పాలిస్తోంది.. ఇందులో ఒకదాన్ని కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా వినియోగిస్తుండగా.. మరో గొట్టంతో దేశంలో వివిధ వర్గాల మధ్య ఐక్యతను దెబ్బతీయటానికి ఉపయోగిస్తోంది" అని రాజ్యసభ మాజీ సభ్యులు బృందాకారత్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమె నూతనంగా నిర్మించిన బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రాన్ని (సిఐటియు జిల్లా కార్యాలయం) ప్రారంభించారు. అనంతరం ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో కార్మికులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు.

ఆర్‌ఎస్‌ఎస్ విధానాలతో బిజెపి ముందుకు సాగుతోందని, ప్రతి ప్రసంగంలో మైనార్టీలను లక్ష్యంగా చేసుకుంటోందని బృందాకరత్ ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీషు వారు ఏ విధంగానైతే విభజించి పాలించే సూత్రాన్ని పాటించారో అదే సూత్రాన్ని బిజెపి ప్రభుత్వం పదేండ్ల నుంచి అనుసరిస్తోందని విమర్శించారు. పార్లమెంటులో రాజ్యాంగం గురించి గొప్పలు చెప్పిన ప్రధాని మోడీ.. దానికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. రాజ్యాంగం నిమ్నజాతులకు హక్కులు కల్పిస్తే.. వీటిని వ్యతిరేకిస్తూ మనుస్మృతిని అమలు చేసేందుకు పూనుకుంటోందని చెప్పారు. 5వ షెడ్యూల్‌ను తొలగించి దేశంలోని అటవీ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. పార్లమెంటులో పోరాటం కారణంగా అటవీ హక్కు చట్టాన్ని సాధించామని, కానీ నేడు పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులపై ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోందని తెలిపారు. పార్లమెంటులో చేసిన ఆదివాసీ వ్యతిరేక చట్టాలకు అనుకూలంగా ఇక్కడి బిజెపి ఎంపి చేతులెత్తారని విమర్శించారు. ఆదివాసులు, కార్మికులు, కర్షకులు కేంద్రం నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం సాగించాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు.

కేంద్రం ధనికులకు రుణాలు మాఫీ చేయడంతో పాటు పన్నులను రద్దు చేసింది కానీ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు కనీస వేతనం, సమాన హక్కుల కోసం పోరాడుతున్నా పెడచెవిన పెడుతోందన్నారు. పోరాటాల ఫలితంగా సాధించిన చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ కోసం పోరాడాలని, అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడితే ఏదైనా సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన మన్యం వీరుడు కుమురంభీం పోరాటం.. రాంజీగోండ్ చేసిన త్యాగాలను ఆమె స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి బి.చంద్రకుమార్, సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, టిఎజిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, కోశాధికారి కె సునీత, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక రాఘవులు, రైతు సంఘం అధ్యక్షులు బండి దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్ రాష్ట్రవ్యాప్త పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ విద్యా కమిషన్ ప్రత్యేకంగా అధ్యయనం చేయనుంది. మెరుగైన విద్య కోసం అవసరమైన సలహాలు, సూచనలు చేసేందుకు మాజీ ఐఎఎస్, కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి నేతృత్వంలో సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, వెంకటేష్, జ్యోత్స్న పర్యటనకు గురువారం నుంచి శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో డిసెంబరు ఏడు వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో పర్యటించి, అక్కడి పరిస్థితులను పరిశీలించనున్నారు. గురువారం సంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్‌లో కమిషన్ పర్యటన చేపట్టింది. కమిషన్ పర్యటనకు సహకరించడంతోపాటు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సిఎస్ శాంతికుమారి ఆదేశించారు.

ఆర్‌టిసి డిపో వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తొలగించిన కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎనలైజర్లు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ఆర్‌టిసి యాజమాన్యం కాంట్రాక్ట్ ఉద్యోగులను సర్వీసు నుంచి తొలగించిందని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గురువారం మహబూబాబాద్ జిల్లాలోని ఆర్టీసీ డిపో వద్ద హైర్ బస్సులను నిలిపేసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి, హైర్‌బస్ సిబ్బంది యూనియన్ గౌర అధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న మాట్లాడుతూ.. తాజాగా స్వామి మాలధారణ వేసుకున్న డ్రైవర్ విధులకు హాజరయ్యే క్రమంలో బ్రీత్ అనలైజర్‌లో తప్పుడు సమాచారం వచ్చిందని తెలిపారు. దాంతో కాంట్రాక్టు ఉద్యోగులు సర్వీసులు నిలిపి ఆర్‌టిసి బస్టాండ్‌లో నిరసన తెలిపినట్టు చెప్పారు. ఇప్పటికైనా ఆర్‌టిసి యాజమాన్యం సరైన బ్రీత్ అనలైజెర్లు వాడి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. తప్పుడు సమాచారం వల్ల సర్వీసు నుంచి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పాత చంద్రశేఖర్, ఐలేష్, శ్రావణ్, మహేందర్, కొమురెల్లి రమేష్, సతీష్, రాజు, సంపత్, సంతు ఎలేందర్, ప్రవీణ్, శ్రీశైలం, ఐలయ్య, వెంకటేష్ సాయి పాల్గొన్నారు.

ఒప్పో కె12ఎక్స్‌లో 5లక్షల యూనిట్ల విక్రయం

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో తన కె12ఎక్స్ 5జి మోడల్‌లో 5 లక్షల యూనిట్లను విక్రయించినట్లు వెల్లడించింది. రూ.15లోపు విలువ కలిగిన ఈ ఫోన్లను గడిచిన సెప్టెంబర్, అక్టోబర్‌లోనే ఈ స్థాయి అమ్మకాలు జరిపినట్లు పేర్కొంది. ఇందులో 32 ఎంపి ఎఐ డ్యుయల్ కెమెరాను ఉపయోగించింది. 6జిబి ర్యామ్, 128జిబి ధరను రూ.12,999గా, 8జిబి ర్యామ్, 256జిబి ధరను రూ.15,999గా నిర్ణయించింది.

ట్రేడింగ్ తేలిక కోసం షేర్.మార్కెట్ 'షీట్స్'

ముంబయి : ట్రేడింగ్ అనుభవాన్ని మరింత తేలిక చేసే రీతిలో డిస్కౌంట్ బ్రోకింగ్ కోసం షీట్స్‌ను ప్రవేశపెట్టినట్లు షేర్.మార్కెట్ తెలిపింది. ట్రేడింగ్ అనుభవాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లి, అవగాహనతో కూడిన పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేందుకు షీట్స్ యూజర్లకు వీలు కల్పిస్తుందని ఫోన్‌పేకు చెందిన ఈ సంస్థ పేర్కొంది. బ్రోకింగ్ రంగంలోనే మొదటిసారిగా షీట్స్‌ను ఆవిష్కరిస్తున్నామని తెలిపింది. రాబోయే రోజుల్లో మరిన్ని అత్యాధునిక ఫీచర్లను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది.

కియా లక్ష యూనిట్ల ఎగుమతి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కియా ఇండియా తమ అనంతపురం ప్లాంట్‌లో తయారు చేసిన 1,00,00 యూనిట్ల సికెడి వాహనాలను ఎగుమతి చేసినట్లు వెల్లడించింది. 2020 జూన్‌లో ఇక్కడి నుంచి ఎగుమతులను ప్రారంభించినట్లు తెలిపింది. భారత్ ఒక కీలక ఎగుమతి కేంద్రంగా స్థాపించడానికి కంపెనీ చేస్తున్న ప్రయత్నాలకు ఈ విజయం ఓ నిదర్శనమని కియా మోటార్స్ చీఫ్ సేల్స్ ఆఫీసర్ జున్సు చో తెలిపారు. దేశీయంగా తయారు చేస్తున్న తమ వాహనాలకు భారత్ కీలక ఎక్స్‌పోర్ట్ హబ్‌గా మారనుందన్నారు. ఉజ్బెకిస్తాన్, ఈక్వెడార్, వియత్నా మార్కెట్లకు అధికంగా 38వేల యూనిట్ల ఎగమతులు చేసినట్లు వెల్లడించారు.

తెలుగు రాష్ట్రాల్లో రెట్టింపు వ్యాపారం లక్ష్యం

- వైద్య బీమాలో స్టార్ హెల్త్‌కు 33 శాతం వాటా
- ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

వైద్య బీమా రంగంలో స్టార్ హెల్త్ 33 శాతం మార్కెట్ వాటాతో లీడర్‌గా ఉందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఆ సంస్థ సీనియర్ రీజినల్ వైస్ ప్రెసిడెంట్ కెబిబి శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో రూ.3,330 కోట్ల క్లెయిమ్‌లను పరిష్కరించామన్నారు. తెలంగాణ, ఎపిలో 100 శాఖలతో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ వచ్చే నాలుగేళ్లలో రెట్టింపు వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశంలో ప్రతీ సెకన్‌కు 10క్లెయిమ్‌లను పరిష్కరిస్తున్నామన్నారు. సంస్థ ఏర్పడినప్పటి నుంచి కోటి పైగా క్లెయింలను సెటిల్ చేశామన్నారు. ఇందులో 74 శాతం క్యాష్‌లెస్ అన్నారు. ఆరు లక్షల ఏజెంట్లతో గతేడాది రూ.15,254 కోట్ల స్థూల ప్రీమియం వసూలు చేశామని.. ఈ ఏడాది రూ.18వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

"వ్యాపార కార్యకలాపాల రీత్యా తెలుగు రాష్ట్రాలు స్టార్ హెల్త్‌కు చాలా కీలకమైనవి. బీమా విస్తృతిని పెంచడానికి ఎపిని దత్తత తీసుకున్నాము. వైవిధ్యమైన ఆరోగ్య సంరక్షణ అవసరాలకు అనుగుణంగా సమగ్రమైన, సరళమైన బీమా సొల్యూషన్స్‌ను అందించడంలో స్టార్ హెల్త్ నిబద్ధతను కలిగి ఉంది. తెలుగు రాష్ట్రాల్లో 1848 హాస్పిటల్స్ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నాము." అని శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలి

- పాఠశాలలు, గురుకులాలను తరచూ తనిఖీ చేయాలి
- విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి
- కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

సిఎం వద్ద నుంచి వివరాల సేకరిస్తున్న అధికారులు, ఎన్యూమరేటర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలనీ, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలక్ష్యానికి తావివ్వొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించి చోటుచేసుకుంటున్న ఘటనలపై గురువారం హైదరాబాద్‌లో సిఎం పలుమార్లు సమీక్షించారు. కలెక్టర్లు తరచూ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలనీ,.. అనంతరం అందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. అనేక సార్లు ఆదేశాలిచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు వారికి పౌష్టికాహారాన్ని అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.. విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారనీ, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామనీ, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. వసతిగృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించడంతో పాటు లేని వార్తలను ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారనీ, వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

పూలేకు సిఎం నివాళి

మహాత్మా జ్యోతిరావు పూలే 134 వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో పూలే చిత్రపటానికి గురువారం సిఎం రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం ఇంట్లో కుల గణన సర్వే

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంట్లో గురువారం అధికారులు, ఎన్యూమరేటర్లు వివరాలు నమోదు చేశారు. అలాగే, సర్వే పురోగతిపై అధికారులను సిఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురువారం హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డితోపాటు ఎన్యూమరేటర్, అధికారులు జూబ్లీహిల్స్‌లోని సిఎం ఇంటికి వెళ్లారు. ముఖ్యమంత్రి ఇంట్లో పూర్తి వివరాలను సర్వే ఫారంలో నమోదు చేశారు. ఈ సందర్భంగా సిఎం.. సర్వేపై ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ పరిధిలో వివిఐపిలు, ఐఎఎస్, ఐపిఎస్, ఎంపిలు ఎమ్మెల్యేలతోపాటు ఇతర ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మహిళల అభివృద్ధికి పాటుపడిన జ్యోతిరావు పూలే

- ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లోనే రాజ్యాంగం రద్దుకు కుట్ర
- పూలే 135వ వర్ధంతిలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల అభివృద్ధి కోసం పాటుపడిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ అన్నారు. రిజర్వేషన్లను రద్దుచేసి అణగారిన వర్గాలను అభివృద్ధికి దూరంగా ఉంచేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో రాజ్యాంగం రద్దుకు మతోన్మాద బిజెపి కుట్ర చేస్తోందని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి జాన్‌వెస్లీ, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాలు, మహిళల అభివృద్ధి కోసం పూలే ఎంతో కృషి చేశారని అన్నారు. జ్యోతిరావు పూలే చిన్నతనం నుంచే సమాజంలో జరుగుతున్న కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా, స్త్రీలకు సమాన హక్కుల కోసం కృషి చేశారని తెలిపారు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడన్నారు. యువతీయువకులు ఆయన స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. స్త్రీలకు సమాన హక్కులు కావాలని, స్త్రీ విద్యపై పోరాడారని, తన భార్య సావిత్రిబాయి పూలేకు స్వయంగా చదువు నేర్పించి ఆమె ద్వారా 1948లో పూణేలో బాలికల విద్య కోసం పాఠశాలను ప్రారంభించారని వివరించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిందన్నారు. కానీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆ రిజర్వేషన్లను రద్దుచేసి అణగారిన వర్గాలను అభివృద్ధికి దూరంగా ఉంచేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ రక్షణ కోసం, రాజ్యాంగ కల్పించిన హక్కుల సాధన కోసం, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.మాణిక్యరాజు, టౌన్ కార్యదర్శి ఆదివిష్ణు, నాయకులు రాజు, నందు, భాస్కర్, సురేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

ఎస్‌ఎస్‌సిలో ఇంటర్నల్ మార్కుల ఎత్తివేత

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది నుంచి వంద మార్కులకు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సబ్జెక్టులోనూ ఇంటర్నల్ అసైన్‌మెంట్స్ పేరుతో 20 మార్కులను కలిపే విధానాన్ని రద్దు చేసింది. ఈసారి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 24 పేజీల బుక్‌లెట్ ఇవ్వాలనే మరో నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ మేరకు గురువారం విద్యాశాఖ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ పదోతరగతి పబ్లిక్ పరీక్షలను ఎస్‌ఎస్‌సి బోర్డు 80 మార్కులకు నిర్వహిస్తున్నది. ఇంటర్నల్ అసైన్‌మెంట్స్ పేరుతో 20 మార్కులను యాడ్ చేస్తున్నది. ఈ సారి అలాకాకుండా వంద మార్కులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకూ మెయిన్ ఆన్సర్ షీట్ (నాలుగు పేజీలు)తో పాటు అదనంగా నాలుగు పేజీల ఆన్సర్ షీట్ ఇస్తున్న విషయం విదితమే. ఈ విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షల నుంచి సైన్స్ మినహా మిగతా ఐదు పరీక్షలకు 24 పేజీల ఒకే బుక్‌లెట్ ఇవ్వనున్నారు. భౌతిక, రసాయన శాస్త్రం పేపర్‌కు 12 పేజీలు, జీవశాస్త్రం పేపర్‌కు 12 పేజీల చొప్పున వేర్వేరుగా బుక్‌లెట్‌లను ఇవ్వనున్నారు. ఎస్‌ఎస్‌సీ పబ్లిక్ ఎగ్జామ్స్-2025 నుంచే ఇది రాష్ట్రంలో అమలులోకి రానున్నది. ఈ మేరకు డిఇఒలు, డిప్యూటీ డిఇఒలు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు, పదోతరగతి విద్యార్థులకు విద్యాశాఖ సమాచారాన్ని పంపింది.

ధర్నా చేస్తున్న వెంకటేశ్, ఎల్ఐసి ఏజెంట్లు

క్లాబ్యాక్ ఆఫ్ కమిషన్ నిబంధనను నిలిపేయాలి

- ఎల్ఐసి ఏజెంట్ల ధర్నాలో వెంకటేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం క్లాబ్యాక్ ఆఫ్ కమిషన్ నిబంధన పేరుతో ఎల్ఐసి ఏజెంట్లకు వస్తున్న కమిషన్‌ను ఐదు శాతం తగ్గించడం అన్యాయమని, ఆ నిబంధనను వెంటనే ఎత్తేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (సిఐటియు అనుబంధం)రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్‌లోని ఎల్ఐసి కార్యాలయం వద్ద హైదరాబాద్-సికింద్రాబాద్ కమిటీల ఆధ్వర్యంలో నలపరాజు సైదులు అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. అందులో ఎల్ఐసి ఎఓఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌విఎన్ రెడ్డి, తన్నీరు కుమార్, సికింద్రాబాద్ జోనల్ అధ్యక్షులు మంజునాథ్, హైదరాబాద్ డివిజన్ కన్వీనర్ గూడూరు ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జె వెంకటేశ్ మాట్లాడుతూ.. దేశంలో ఏ సంస్థలోని ఉద్యోగులకైనా ఉన్న జీతాలను, కమిషన్లను తగ్గించకుండా పెరిగే ధరలకనుగుణంగా కొంత మొత్తంలోనైనా పెంచడం సాంప్రదాయమని చెప్పారు. దానికి భిన్నంగా మోడీ సర్కారు ఎల్ఐసీ ఏజెంట్లకు కమిషన్ తగ్గించడం దారుణమని విమర్శించారు. ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియంపై జీఎస్‌టిని తక్షణమే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి ఏజెంట్లు కేవలం తమ భద్రత కోసమే కాకుండా ఎల్ఐసీ మరింత పటిష్టంగా ఉండాలనీ, సంస్థ పరిరక్షణే ధ్యేయంగా శ్రమించి పని చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎల్ఐసీ బలోపేతం కోసం తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందర్నీ ఎల్ఐసీ ఎఓఐ జాగృతం చేసే కృషికి, భవిష్యత్ కార్యాచరణకు సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ అండగా నిలబడుతుందని హామీనిచ్చారు. మంజునాథ్ పాలసీలపై బోనస్ రేటును పెంచాలని, ప్రతి పాలసీదారుని గరిష్ట వయసును 50 ఏళ్లకు పెంచాలని, ఏజెంట్లకు మొదటి సంవత్సరపు కమిషన్‌ను పాత పద్ధతిలోనే చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రెండు నెలల నుంచి ఎల్ఐసీ ఏజెంట్లకు ఇస్తున్న కమిషన్ తగ్గింపును వ్యతిరేకిస్తూ విస్తృత స్థాయిలో క్యాంపెయిన్ ఎల్ఐసి ఏఓఐ చేస్తున్నదనీ, ఆ ఉద్యమానికి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

వైద్య బీమాలోకి ఎల్ఐసి..!

ముంబయి : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఆరోగ్య బీమా రంగంలోకి ప్రవేశించడానికి కసరత్తు చేస్తోంది. ఇందుకోసం మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో 50 శాతం వాటా కొనుగోలుకు చర్చలు జరుపుతోంది. ప్రస్తుతం మణిపాల్ సిగ్నా హెల్త్ అనేది మణిపాల్ ఎడ్యుకేషన్, మెడికల్ గ్రూప్, అమెరికాకు చెందిన సిగ్నా కార్పొరేషన్ సంయుక్త భాగస్వామ్యంలో నడుస్తోంది. ఇందులో మణిపాల్ గ్రూపునకు 51 శాతం, సిగ్నాకు 49 శాతం చొప్పున వాటా ఉంది. ఎల్ఐసి వాటా కొనుగోలు చేయాల్సి వస్తే.. ఆ రెండు సంస్థలు సమానంగా తమ వాటాను తగ్గించుకోనున్నాయి. ఇందులో రూ.2,000 కోట్ల వరకు ఎల్ఐసి పెట్టుబడి పెట్టనుందని అంచనా. ప్రస్తుతం ఈ చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయని సమాచారం.

ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల మొండి బాకీల రద్దు

న్యూఢిల్లీ : భారత బ్యాంకింగ్ రంగంలో ప్రతీ ఏడాది సగటున రూ.2 లక్షల కోట్ల చొప్పున మొండి బాకీలు రద్దు అవుతున్నాయి. ఆర్థిక సంవత్సరం 2019-20 నుంచి 2023-24 మధ్య రూ.9.90 లక్షల కోట్ల పారు బకాయిలను బ్యాంకులు రద్దు చేశాయి. "2019-20లో రూ.2.34 లక్షల కోట్లు, 2020-21లో 2.03 లక్షల కోట్లు, 2021-22లో 1.75 లక్షల కోట్లు, 2022-23లో రూ.2.08 లక్షల కోట్లు, 2023-24లో రూ.1.70 లక్షల కోట్ల చొప్పున ఎన్‌పిఎలను కొట్టిపారేశాయి." అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పార్లమెంట్‌లో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అత్యధిక మొత్తంలో రుణాలు రద్దు చేయబడిన మొదటి పది బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు ఉన్నాయి. ఎన్‌పిఎలను రద్దు చేసినప్పటికీ.. రికవరీ చర్యలు కొనసాగుతాయని మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు 2024 మార్చి 31 నాటికి భారత్‌లోని మొత్తం బ్యాంక్‌ల స్థూల ఎన్‌పిఎలు రూ.4.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో అత్యధికంగా ఎస్‌బిఐకి చెందిన రూ.84,276 కోట్ల ఎన్‌పిఎలు, తర్వాత స్థానంలో పిఎన్‌బి ఎన్‌పిఎలు రూ.56,343 కోట్లుగా ఉన్నాయి.

సుస్థిరాభివృద్ధిలో యువ ఇంజనీర్లు కీలకం

- ఇస్కీ అంతర్జాతీయ సదస్సులో వక్తలు

హైదరాబాద్ బ్యూరో : ఇంజనీరింగ్ రంగంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు రావాలని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఇస్కీ) ఆధ్వర్యంలో "ఇంజనీరింగ్ సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు, స్థిరమైన అభివృద్ధి" అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలకత్తా ఇన్‌సిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ ఇండియా వైస్ చైర్మన్ డాక్టర్ నూతన్ కుమార్ దాస్ మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణల ఆవశ్యకతపై ఐక్యరాజ్య సమితి సూచనల అమలుకు ఇంజనీరింగ్ నిపుణులు మరింతగా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, వనరుల క్షీణత, సామాజిక-ఆర్థిక అసమానతలు వంటి అనేక సమస్యలకు పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు. నూతన పరిశ్రమలు, స్మార్ట్ నగరాలు, బాధ్యతాయుతమైన వినియోగం ఉత్పత్తికి సంబంధించిన అంశాలతో పాటు 2030 నాటికీ ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు పరిశోధనలు జరగాలని అభిప్రాయపడ్డారు. కళశాల డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర్‌రావు మాట్లాడుతూ... ఇస్కీ గత నాలుగు దశాబ్దాలుగా పర్యావరణం, పవర్ అండ్ ఎనర్జీ, క్వాలిటీ అండ్ ప్రొడక్టివిటీ, మేనేజ్ మెంట్ టెక్నాలజీ, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, మైనింగ్‌కు సంబంధించిన అంశాలపై పరిశోధనలు చేస్తోందని అన్నారు.

రవాణాశాఖలో ప్రమోషన్ల ఉత్తర్వులు జారీ

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రవాణాశాఖలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లను జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లుగా, ఆర్‌టిఓలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లుగా ప్రమోషన్స్ కల్పిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొంతకాలంగా రవాణా శాఖలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగోన్నతులు కల్పించినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ప్రమోషన్స్ పొందిన మామిండ్ల చంద్ర శేఖర్‌గౌడ్, శివ లింగయ్య, డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతులు పొందిన రవీందర్ కుమార్, ఆర్ వాణి, సదానందం, కిషన్, సురేష్ రెడ్డి హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ప్రత్యేక చొరవ వల్లే ఈ ఉద్యోగోన్నతులు సాధ్యమయ్యాయని వారు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాం

- వలసల జిల్లాకే వలసలు రావాలి
- మిగతా రుణమాఫీ, రైతుభరోసాపై 30న సిఎం ప్రకటన : మంత్రి తుమ్మల
- దుర్భర ఆర్థిక పరిస్థితుల్లోనూ రైతు రుణమాఫీ చేశాం : మంత్రి జూపల్లి
- రైతుల పండుగను చూస్తుంటే ఆనందం వేస్తోంది : మంత్రి దామోదర్
- అమిస్తాపూర్‌లో 'రైతు పండుగ' ప్రారంభం

ప్రత్యేక స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వచ్చే కొత్త వంగడాలతోపాటు కొత్త వ్యవసాయ విధానాలతో సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలోని అమిస్తాపూర్ గ్రామంలో మూడ్రోజులపాటు (28-30వరకు) నిర్వహిస్తున్న 'రైతు పండుగ'ను గురువారం మంత్రి ప్రారంభించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రైతులపై భారం పడకుండా అధునాతన వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించేందుకు ఈ సంబురాలలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులందరూ కొత్తకొత్త పంటల సాగుకు ముందుకు రావాలని సూచించారు. ఎక్కువ ఆదాయం వచ్చే వ్యాపార పంటల వైపు దృష్టిసారించాలని చెప్పారు.

బూర్గుల రామకృష్ణారావు తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి మళ్లీ ముఖ్యమంత్రి కావడం అదృష్టమన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి బతుకు జీవనం కోసం వలసలు పోయే ప్రజలు ఈ జిల్లాకే వలసలు వచ్చే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా.. ఆర్థిక వనరులు సమృద్ధిగా లేకపోయినా ఇప్పటికే ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ చేశామన్నారు. మిగిలిన రుణమాఫీ, రైతు భరోసా వంటి అంశాలపై 30వ తేదీన జరిగే రైతుల సభలో ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటన చేస్తారని తెలిపారు. మేము చేయలేకపోతే రైతుల కాళ్లు పట్టుకొని క్షమాపణ కోరుతామని, మీరిచ్చిన అధికారం మీ కోసమే వినియోగిస్తామని అన్నారు.

అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాం : మంత్రి జూపల్లి

రాష్ట్రంలో 60 వేల కోట్ల అప్పులు ఉన్నా.. ప్రతి నెలా 6 కోట్లు మిత్తి చెల్లిస్తున్నా సంక్షేమం ఆపలేదని, అభివృద్ధికి ఆటంకం లేకుండా ముందుకు సాగుతున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి.. చిప్ప చేతికి ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా, ఆటంకాలను అధిగమిస్తూ సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉన్నా రైతుల అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోందన్నారు.

వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం : మంత్రి దామోదర్

ముఖ్యమంత్రి సొంత జిల్లాలో జరుగుతున్న రైతుల పండుగకు హాజరైన రైతులను చూస్తుంటే ఆనంద భాష్పాలు వస్తున్నాయని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. పేదలకు వైద్యం ఎంత ముఖ్యమో.. మనం తినే తిండి కూడా అంతే ముఖ్యమని అన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని, తమ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పారు.

దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, పర్ణిక రెడ్డి, వాకటి శ్రీహరి, మెగారెడ్డి అన్నారు. రైతులను గత ప్రభుత్వం నిలువునా ముంచిందన్నారు. అధికారం పోయిందన్న అక్కసుతో కడుపులో విషాన్ని నింపుకొని.. మనసులో ద్వేషం పెంచుకొని, ప్రజలను తప్పు దోవ పట్టించే విధంగా 'కాంగ్రెస్ వచ్చింది కరువు తెచ్చింది' అని దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని, కానీ మంచి మనసున్న రేవంత్‌రెడ్డి ఆలోచన, మంచి సంకల్పం వల్ల ప్రజాపాలనలో ప్రకృతి సైతం సహకరించి వర్షాలు బాగా కురిసి చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు పూర్తిగా నిండాయని, రైతులు సంతోషంగా పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సంకల్పాన్ని అర్థం చేసుకొని రైతులు సన్నవడ్లను పండించారని అభినందించారు. ఈ రైతుల పండుగ సంబరాలలో వివిధ కంపెనీల కొత్త వంగడాలు, ఆయా కంపెనీల యంత్రాలు, పశువుల ఉత్పత్తి తదితర అంశాలపై 150 స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, వ్యవసాయ చైర్మన్ కోదండ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జహీర్ అత్తర్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, పద్మశ్రీ వెంకటరెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రూ.30 లక్షల సైబర్ మోసం..!

- డిజిటల్ అరెస్ట్ స్కామ్ నుంచి రక్షించిన ఎస్‌బిఐ సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సిబ్బంది తమ మరో ఖాతాదారున్ని డిజిటల్ అరెస్ట్ నుంచి కాపాడగలిగింది. హైదరాబాద్‌ని లోతుకుంటా శాఖలోని సిబ్బంది చాకచక్యంగా ఖాతాదారుడి రూ.30 లక్షలను సైబర్ మోసం నుంచి రక్షించారు. ఎస్‌బిఐ లోకల్ హెడ్ ఆఫీసు హైదరాబాద్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ఎజిఎం జి రామక్రిష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. లోతుకుంటలోని వైద్య దంపతులిద్దరిని ఢిల్లీ క్రైమ్ పోలీసుల పేరుతో బ్లాక్ మెయిల్ చేశారు. వారి ఆధార్ కార్డుతో పలు బ్యాంక్ ఖాతాలు తెరిచి.. రూ.80 కోట్ల అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారని ఆ దంపతులిద్దరిని ఢిల్లీ క్రైమ్ పోలీసు ఎసిపి సునీల్ కుమార్ పేరుతో బెదిరించారు. వారిని ఈ కేసు నుంచి తప్పించాలంటే కొంత మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వారు రూ.30 లక్షలు చెల్లించడానికి అంగీకారంతో ఎస్‌బిఐ బ్యాంక్ శాఖకు వచ్చారు. తమ సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్స్ (ఎస్‌సిఎస్‌ఎస్) నుంచి నగదు ఉపసంహరణ, బదిలీకి రావడంతో అక్కడి సిబ్బందికి అనుమానం రావడం, విచారణ చేయగా అసలు విషయం తెలిసింది. బ్రాంచ్ మేనేజర్ నవీన్ కుమార్ ఈ విషయంలో చొరవ తీసుకున్నారు. పోలీసులతో వారికి అర్థమయ్యేలా చెప్పించారు. తమ రూ.30 లక్షలు దక్కించినందుకు గాను ఆ వైద్య దంపతులిద్దరు ఆ బ్యాంక్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే తరహాలో ఇటీవల చంద్రయాన్‌గుట్ట శాఖలోనూ రూ.46 లక్షలు, మహబూబునగర్‌లోనూ రూ.4.20 లక్షల డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల నుంచి అక్కడి సిబ్బంది తమ ఖాతాదారులను రక్షించారు.

ఫుడ్ పాయిజన్‌పై టాస్క్ ఫోర్స్

- ముగ్గురు సభ్యులతో ఆహార నాణ్యత పరిశీలన
- ఉత్తర్వులు జారీ
- కమిటీ రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని గురుకులాల్లో వరసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఆహార నాణ్యత పరిశీలనకు టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. ముగ్గురు సభ్యులతో ఆ కమిటీని ఏర్పాటు చేస్తూ గురువారం సిఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ లేదా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఆయా సంస్థల అధిపతులు, జిల్లా స్థాయి అధికారులు గురుకులాలు, హాస్టళ్లు, అంగన్‌వాడీలు ఆస్పత్రుల్లో ఆహార నాణ్యతను ఈ కమిటీ పర్యవేక్షించనున్నది.

ఫుడ్‌పాయిజన్ జరిగితే దానికి గల కారణాలు, బాధ్యులను గుర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ళ, అంగన్‌వాడీలు, ఆస్పత్రుల్లో ఆహార భద్రత కోసం ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్, వార్డెన్, మరో ఇద్దరు సిబ్బంది సభ్యులుగా ఆహార నాణ్యత కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఆహార నాణ్యతలో రాజీ పడకూడదంటూ ఆదేశాలు జారీ చేసింది. ప్రతి రోజు వంట చేయటానికి ముందు స్టోర్‌రూమ్, వంటగది పరిశీలించి ఫొటోలు తీయాలని ఆదేశాలిచ్చింది. ఫుడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు భోజనం చేసిన తర్వాతే ఆ ఆహార పదార్థాలను పిల్లలకు పెట్టాలని పేర్కొంది.

ప్రవేశాలకు శివ్‌నాడార్ యూనివర్శిటీ దరఖాస్తులు

హైదరాబాద్ : వచ్చే విద్యా సంవత్సరం 2025-26 ప్రవేశాలకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శివ్‌నాడార్ యూనివర్శిటీ ఢిల్లీ ఎన్‌సిఆర్ ప్రకటించింది. తమ నాలుగు స్కూల్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టరల్ ప్రోగ్రాంస్ కోసం అడ్మిషన్స్ కోరుకునే వారు తమ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. తమ సంస్థ 17 యుజి, 10 మాస్టర్ ప్రోగ్రాం, 16 పిహెచ్‌డి ప్రోగ్రాంస్‌ను అందిస్తుందని తెలిపింది.

'మూసీ'పై కేంద్రాన్ని తప్పుదోవపట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- వాస్తవాలను దాచిపెడుతున్న సిఎం రేవంత్ : హరీశ్‌రావు
- చర్చకు సిద్ధమా అంటూ సవాల్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్

మూసీ బాధితులకు పునరావాసం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం... కేంద్రాన్ని, పార్లమెంటును తప్పుదోవపట్టిస్తోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించి 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేస్తున్నామంటూ రేవంత్ సర్కారు పచ్చి అబద్ధాలు వల్లె వేస్తోందని ఆయన దుయ్యబట్టారు. తమ పార్టీ రాజ్యసభ సభ్యుడు కెఆర్ సురేష్‌రెడ్డి పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు వచ్చిన సమాధానం ఇదే విషయాన్ని రుజువు చేస్తోందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ... మూసీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ అమలు చేస్తున్నది ఒకటి, కేంద్రానికి చెబుతోంది మరొకటని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం కంటే మెరుగైన చట్టాన్ని అమల్జేశామని తెలిపారు. నిర్వాసితులకు 250 గజాల స్థలంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇచ్చామని గుర్తు చేశారు. కానీ రేవంత్ సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టపోతున్న బాధితులను ముందుగా గుర్తించాల్సిన ప్రభుత్వం... ఆ విధానాన్ని ఎక్కడా పాటించటం లేదన్నారు. ఎలాంటి నోటీసులు, డిపిఆర్‌లు, ఎన్యుమరేషన్లు లేకుండానే ఇళ్లను కూలగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం ముందుగా పబ్లిక్ నోటీసులివ్వాలి, అభ్యంతరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి, వాటిని పరిష్కరించాకే అధికారులు ముందుకెళ్లాలని తెలిపారు.

కానీ మూసీ ప్రక్షాళన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవేవీ పాటించటం లేదని వాపోయారు. ముఖ్యమంత్రే స్వయంగా మున్సిపల్ శాఖను పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఇలాంటి చర్యలు తగునా? అని ప్రశ్నించారు. హైడ్రా విషయంలోనూ సర్కారు ఇదే రకంగా అన్యాయంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇలాంటి దుందుడుకు చర్యలతో సిఎం రేవంత్ పేదల ఉసురుపోసుకుంటున్నారని దుయ్యబట్టారు. మూసీ బాధితులకు పరిహారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంటులో చెప్పిన అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హరీశ్‌రావు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ చర్చకు ముఖ్యమంత్రి సిద్ధమా? అని సవాల్ విసిరారు. మూసీ, హైడ్రా బాధితుల సమస్యలపై వచ్చే శాసనసభా సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలేస్తామని ఆయన హెచ్చరించారు.

హైటెక్స్‌లో ఘనంగా పౌల్ట్రీ ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్

దక్షిణాసియాలోనే అతిపెద్ద అంతర్జాతీయ పౌల్ట్రీ ప్రదర్శన హైదరాబాద్‌లో జరుగుతోంది. హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన 16వ ఎడిషన్ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో నవంబర్ 29 వరకు కొనసాగనుందని ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపిఇఎంఎ), పౌల్ట్రీ ఇండియా వెల్లడించాయి. దీనికి అనుబంధంగా మంగళవారం నాలెడ్జ్ డే టెక్నికల్ సెమినార్ జరిగిందని నిర్వాహకులు తెలిపారు. "అన్‌లాకింగ్ పౌల్ట్రీ పొటెన్షియల్" అనే అంశంపై నెట్‌వర్కింగ్, విజ్ఞానాన్ని పంచుకునేందుకు, అంతర్జాతీయ పౌల్ట్రీ పరిశ్రమలో వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శించడానికి ఈ అంతర్జాతీయ పౌల్ట్రీ పరిశ్రమ ఒక వేదిక కానుంది. 50కి పైగా దేశాల నుంచి సుమారు 400 మంది ప్రదర్శకులు ఇందులో పాల్గొన్నారు. కోళ్ల పరిశ్రమ రైతులు, ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ఇంటిగ్రేటర్లు, ప్రపంచ పౌల్ట్రీ నిపుణులు సహా దాదాపు 40,000 మంది సందర్శకులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. కోళ్ల పరిశ్రమ నిర్వహణ, ఆరోగ్యం, పోషణ, ఉత్పత్తి సాంకేతికతలలో తమ ఆవిష్కరణలను ప్రదర్శించడానికి జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ ఉత్పత్తులను ప్రదర్శించాయని ఐపిఇఎంఎ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ తెలిపారు.

బిడిఎల్‌లో బిడిఇయు (సిఐటియు) గెలుపు

- ఐఎన్‌టియుసి అనుబంధ యూనియన్‌పై 116 ఓట్లతో విజయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బిడిఎల్) వెరిఫికేషన్ ఎన్నికల్లో సిఐటియు అనుబంధ యూనియన్ అయిన భారత్ డైనమిక్ ఎంప్లాయీస్ యూనియన్ ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ అనుబంధ సంఘమైన భారత డైనమిక్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్‌పై 116 ఓట్లతో గెలుపొందింది. గురువారం హైదరాబాద్‌లోని ఆ సంస్థలో ఎన్నికల అధికారి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. 1550 మంది ఉద్యోగులు ఓటు హక్కు కలిగి ఉండగా అందులో నేరుగా 1512 మంది ఓట్లు వేశారు. 20 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలైన 1532 ఓట్లలో బిడిఇయు (సిఐటియు అనుబంధం)కు అత్యధికంగా 788 ఓట్లు లభించాయి. ఆ తర్వాత బిడిఇటియు (ఐఎన్‌టియు అనుబంధం)కు 672 ఓట్లు దక్కించుకుంది. బిఎంఎస్ అనుబంధ సంఘమైన బిడిఎల్ కార్మిక సంఘ్ కేవలం 70 ఓట్లకే పరిమితమైంది. మొత్తంగా రెండు ఓట్లు చెల్లుబాటు కాలేదు. అంతిమంగా భారత్ డైనమిక్ ఎంప్లాయీస్ యూనియన్ 116 ఓట్లతో విజయం సాధించినట్టు ఎన్నికల అధికారి డి.శ్రీనివాసులు ప్రకటించారు.

బిడిఎల్ ఉద్యోగులకు, యూనియన్ నాయకులకు సిఐటియు అభినందనలు

ఎన్నికల్లో స్టార్ గుర్తుకు ఓటేసి బిడిఎల్ఇయును గెలిపించిన ఉద్యోగులకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ విప్లవ జేజేలు తెలిపారు. ప్రతిష్టాత్మక సంస్థలో 116 ఓట్లతో గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సిఐటియు అనుబంధం సంఘం గెలుపులో కీలక పాత్ర పోషించిన బిడిఎల్‌యు నాయకులకు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన బిఆర్‌టియు నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటాలకు సిఐటియు ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఆ కంపెనీతో ఎలాంటి సంబంధమూ లేదు : తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లాలోని ఇథనాల్ కంపెనీతో తన కుటుంబానికి ఎలాంటి సంబంధమూ లేదని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఆ కంపెనీతో తన కుమారుడికి సంబంధాలున్నట్టు పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి సీతక్క చేసిన ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ స్థానిక ప్రజలు ధర్నాలు చేపడుతున్నారనీ, దీనికి రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ కంపెనీతో తన కుటుంబానికి సంబంధాలున్నట్టు నిరూపిస్తే... ఆ కంపెనీనే రాసిస్తానంటూ సవాల్ విసిరారు.

నేడు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్

- తెలంగాణ భవన్‌లో ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ దీక్ష చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం అన్ని జిల్లాల్లో 'దీక్షా దివస్' పేరిట కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో చేపట్టబోయే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, శాసనమండలిలో బిఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్ తదితరులు పరిశీలించారు. అంతకుముందు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా కేటీఆర్, ఇతర నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

ఎఫ్‌టిఎల్ స్థలంలో అక్రమంగా చదును

- 'సంధ్య కన్వెన్షన్' శ్రీధర్‌రావుపై కేసు నమోదు

ప్రజాశకి - హైదరాబాద్

ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు సంధ్య కన్వెన్షన్ యాజమాని శ్రీధర్‌రావుపై రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సిఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాగూడలోని భగీరథ చెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో మట్టి పోసి చదును చేస్తున్నట్టు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇరిగేషన్ అధికారులు శ్రీధర్‌రావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువు ప్రాంతంలో చదును చేస్తున్న జెసిబిని సీజ్ చేసి, స్వాధీనం చేసుకున్నారు. శ్రీధర్‌రావుతోపాటు మరో ముగ్గురు వెంకటేశ్వరరావు, వీర వెంకట సత్యనారాయణ మూర్తి, మణికంఠలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలోనూ శ్రీధర్ రావుపై పలు కేసులు ఉన్నట్టు సమాచారం.

హెచ్‌డిఎఫ్‌సి నుంచి ప్రగతి సేవింగ్స్ ఖాతాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ : గ్రామీణ, చిన్న పట్టణాల ప్రజల బ్యాంకింగ్ అవసరాలను తీర్చేందుకు ప్రత్యేకంగా ప్రగతి సేవింగ్స్ ఖాతాను అందుబాటులోకి తీసుకువచ్చామని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. ప్రస్తుతం తమ శాఖల్లో 51 శాతం చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లోని 4600 పైగా శాఖల్లో రైతులతో సహా, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులకు తక్కువ నిర్వహణ వ్యయాలతో ఈ ఖాతాలను జారీ చేయనున్నట్లు తెలిపింది.

రైల్వే భద్రత మరింత మెరుగుకు 'సంరక్ష'

- మొబైల్ అప్లికేషన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయాణీకుల భద్రత కోసం తీసుకొంటున్న చర్యలలో భాగంగా గురువారం పాన్-ఇండియా 'సంరక్ష' మొబైల్ అప్లికేషన్ ప్రారంభించారు. భారతీయ రైల్వేలోని ఫ్రంట్‌లైన్ భద్రతా కేటగిరీ సిబ్బంది సామర్థ్యాన్ని పెంచడం ద్వారా రైల్వే భద్రతను మెరుగుపరచడం ఈ మొబైల్ అప్లికేషన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యంగా దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఆపరేషన్స్ బిజినెస్ డెవలప్‌మెంట్ సభ్యులు రవీందర్ గోయల్ భారతీయ రైల్వేలోగల అన్ని ప్రధాన కార్యాలయాలకు సంబందించిన ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్లు, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్లు, డివిజనల్ డివిజనల్ రైల్వేమేనేజర్లు ఇతర అధికారుల సమక్షంలో న్యూఢిల్లీ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంరక్ష మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఈ అప్లికేషన్‌ను 2013 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ ఆఫీసర్ దిలీప్‌సింగ్ రూపొందించారు. ఈ సందర్భంగా నాగ్‌పూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నమితా త్రిపాఠి పైలట్ ప్రాజెక్టును నాగ్‌పూర్ డివిజన్‌లో అమలు చేస్తూ ఈ ప్రాజెక్టు పనితీరుపై మిగతా అధికారులకు అవగాహన కల్పించారు.

వాల్యూజోన్ కచ్చితంగా గొప్ప రిటైల్ ఫార్మాట్

- ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ
- నాచారంలో 'వాల్యూజోన్' షాపింగ్ మాల్ ప్రారంభం

విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్

రిటైల్ వ్యవస్థ చరిత్రలో 'వాల్యూజోన్' సరికొత్త అధ్యాయమని, వినూత్నమైన షాపింగ్ అనుభవాన్ని పొందాలనుకునే వినియోగదారులకు హైపర్ మార్ట్ వాల్యూజోన్ ఆకర్షణీయ కేంద్రం అని ప్రముఖ నటుడు, ఎపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. దేశంలోనే అతి పెద్ద హైపర్ మార్ట్ వాల్యూజోన్‌ను హైదరాబాద్ నాచారంలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాల్యూజోన్ ఉత్పత్తుల శ్రేణి, షాపింగ్ అనుభవం, సాటిలేని రీతిలో హైదరాబాద్‌కు గర్వకారణంగా మారుతుందని చెప్పారు. వాల్యూజోన్‌లోని కలెక్షన్లు, బ్రాండ్లు, ఆహ్లాదకరమైన సమయం వినియోగదారుల కోసం వేచి ఉన్నాయన్నారు. భారతదేశపు అతి పెద్ద హైపర్ మార్ట్‌లో షాపింగ్ అనుభవాన్ని పొందాలన్నారు. నాచారంలోని రామకృష్ణ స్టూడియోలో గతంలో తాను షూటింగ్స్‌లో పాల్గొంటూ చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరిగేవాన్నని గుర్తు చేసుకున్నారు. అందువల్ల తాను లోకల్ అని అన్నారు. తెలుగు రాష్ట్రాలు రెండుగా ఉన్నప్పటికీ మనమంతా ఒక్కటేనన్నారు.

ఎంబిబిఎస్ విద్యార్థులకు బాసటగా ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.. బాలకృష్ణ చేతుల మీదుగా నలుగురు ఎంబిబిఎస్ విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ఎంబీబీఎస్ సీటు సాధించిన వారికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఫీజు చెల్లించడం గొప్ప విషయమని బాలకృష్ణ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయనను అభినందించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోజువారి అవసరాలకు వన్ స్టాప్ ఫ్యామిలీ షాప్

వాల్యూజోన్ హైపర్ మార్ట్ ఆలోచన పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు, దివంగత పి.సత్యనారాయణది. మారుతున్న రిటైల్ ఫార్మాట్‌ను రూపొందించాలనే వారి సామూహిక దృష్టి, ఈ విస్తారమైన షాపింగ్ గమ్యస్థానంగా మారింది. ఫ్యాషన్, కిరాణా సరుకులు, ఫుట్‌వేర్, లగేజ్, ఫర్నిషింగ్, స్టేషనరీ, సాధారణ సరుకులతో పాటు ప్రఖ్యాతిగాంచిన ప్రపంచ, భారతీయ బ్రాండ్లను వినియోగదారులకు అందించడంపై దృష్టిసారించి, ఒకేచోట సమగ్ర రిటైల్ షాపింగ్ అనుభవాన్ని వాల్యూజోన్ అందిస్తుంది. ఫ్యాషన్, నిత్యావసర సరుకులు, వస్తువులపై 365 రోజులూ అద్భుతమైన ఆఫర్లు ఉండనున్నట్టు నిర్వాహకులు చెప్పారు. "1.7 లక్షల చదరపు అడుగులతో మునుపెన్నడూ లేని షాపింగ్ అనుభవం, సౌకర్యవంతమైన షాపింగ్, వెడల్పైన ఐల్స్ హ్యాసిల్, ఫ్రీ చెకౌట్ కోసం 40 ప్లస్ క్యాష్ కౌంటర్లు, 2000 ప్లస్ ఉత్పత్తులు, ఒక వస్తువు కొనుగోలుపై మరొకటి పొందే అవకాశం, విస్తృతమైన స్టాక్‌తో పెద్ద మొత్తంలో ఆదా" అవుతుందన్నారు. 10,000 ప్లస్ కిరాణా వస్తువులతో మీ అవసరాలన్నీ ఒకేచోట ఉండనున్నాయి. బహుళ వస్త్రాల బ్రాండ్ల నుంచి 1000 ప్లస్ ఉత్పత్తులు.. ఇంటిని స్టైలిష్‌గా సౌకర్యవంతంగా చేస్తాయి. పురుషుల కోసం ఎంచుకోవడానికి 100 కంటే ఎక్కువ జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు, 2000 ప్లస్ రకాల సిల్క్ చీరలు, ప్రతి సందర్భం, సంప్రదాయం శైలికి అనుకూలంగా చీరలు లభించనున్నాయి. వాల్యూజోన్ వినోదం, సౌకర్యం ఆహ్లాదకరమైన షాపింగ్‌ను కలిపే రిటైల్ అనుభవాన్ని పంచుతుంది. వాల్యూజోన్‌ను పలు ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాచారంలో వాల్యూజోన్ హైపర్ మార్ట్‌ను అనేక రవాణా మార్గాల ద్వారా సులభంగా చేరుకోవచ్చు. ఇది ఆదర్శవంతమైన షాపింగ్ గమ్యస్థానంగా మారుతుంది. రాయితీ బ్రాండెడ్ ఉత్పత్తుల ద్వారా వినియోగదారులు, ఫ్యాషన్, ఫుడ్, ఫన్‌లతో కూడిన ప్రత్యేకమైన రిటైల్ అనుభవాన్ని ఆస్వాదించడానికి ఔట్‌లెట్ మాల్‌గా రూపొందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఓ విద్యార్థి సంఘం నాయకుని అరెస్టు

అక్రమ వసూళ్లకు పాల్పడుతూ..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సివిఆర్ కళాశాల యాజమాన్యాన్ని బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఓ విద్యార్థి సంఘం నాయకుడిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నార్సింగి పిఎస్ పరిధిలో గురువారం జరిగింది. నార్సింగ్ సిఐ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నాగారం ప్రశాంత్ ఓ విద్యార్థి సంఘంలో పనిచేస్తున్నాడు. అతను సివిఆర్ కళాశాల మేనేజర్ శ్రీపతి నారాయణరెడ్డికి పలుమార్లు ఫోన్‌చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. కళాశాల నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందని ఆరోపిస్తూ.. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యం ఇలాగే వేధించడంతో నారాయణరెడ్డి పోలీసులను ఆశ్రయించారు. నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నార్సింగి పోలీసులు ప్రశాంత్‌ను అరెస్టు చేసి గురువారం రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచారు. నిందితునికి రాజేంద్రనగర్ కోర్టు జడ్జి 24 రోజుల జ్యూడిషియల్ కస్టడీ విధించినట్టు సిఐ తెలిపారు.